క్లుప్తంగా

మాజీ ఎంపీ కొనకళ్లకు పేర్ని కిట్టు పరామర్శ



మచిలీపట్నం టౌన్: గుండె సంబంధ చికిత్స అనంతరం మచిలీపట్నంలోని తన ఇంటికి వచ్చిన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును బుధవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాజీ ఎంపీ కొనకళ్ల ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, తదితర ప్రముఖులు కొనకళ్లను, ఆయన సోదరుడు బుల్లయ్యను పరామర్శించారు.

భక్తిశ్రద్ధలతో స్నాతకపు కావిడి మహోత్సవం



అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్నాతకపు కావిడి మహోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి నిత్యహోమం, బలిహరణం, విశేష పూజలు, జగజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వైభవంగా యల్లమ్మ అమ్మవారి జాతర



మోదుమూడి(అవనిగడ్డ): మండల పరిధిలోని మోదుమూడి యల్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామ యువత ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, ద్రాక్ష రసం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయం ముందు అమ్మవారి ఆకారంలో వేసిన ముగ్గు పలువురిని విశేషంగా ఆకట్టుకుంది.

22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పెడన: పట్టణంలోని దక్షిణ తెలుగుపాలెంలో బుధవారం వేకువ జాము నుంచి నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో ధ్రువీకరణ పత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెడన పట్టణంలోని దక్షిణ తెలుగుపాలెం క్రిటికల్ ఏరియాగా గుర్తించామన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆ ప్రాంతంలో తనిఖీలు చేశామన్నారు. ఈ తనిఖీల్లో పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను పోలీసు స్టేషన్ల సిబ్బందితో పాటు ప్రత్యేక పోలీస్ దళాలు కూడా పాల్గొన్నాయన్నారు. 22 ద్విచక్ర వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించని కారణంగా పెడన పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. వాటికి సంబంధించి సరైన ధ్రువీకరణ చూపించి తీసుకు వెళ్లాల్సిందిగా వాహన యాజమానులకు తెలియజేశామన్నారు.

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.1.01 లక్షల విరాళం



కోడూరు: స్థానికంగా నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి పూతబోయిన వెంకట కృష్ణారావు- శ్రీలక్ష్మి దంపతులు రూ.1,0,1,116 నగదును విరాళంగా అందించారు. బుధవారం ఈ నగదును కమిటీ సభ్యులకు అందించారు. పూర్తి గ్రానైట్‌తో నిర్మిస్తున్న ఆలయానికి తమవంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని వెంకటకృష్ణారావు దంపతులు తెలిపారు. కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, అన్నం దానారావు, ఉల్లి రంగారావు, బడే భవన్నారాయణ, అన్నం శివరామకృష్ణ, అన్నం సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు ఏజెంట్లు ఉండాలి

- ఓట్లలెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాటు
- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు మూడు టేబుల్స్
- పెడన ఎన్నికల అధికారి వెంకటరమణ



మాట్లాడుతున్న పెడన ఎన్నికల అధికారి వెంకటరమణ, పక్కన డీఎస్పీ రమేష్‌బాబు

పెడన: పెడన నియోజకవర్గానికి సంబంధించి జూన్ 4వ తేదీన కృష్ణా యూనివర్సిటీలో లెక్కింపు జరుగుతుందని, ఇందు కోసం 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తామని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి. వెంకటరమణ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన తహసీల్దారు కార్యాలయంలో నియోజనకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులు, ఏజెంట్లతో ఓట్ల లెక్కింపుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వారికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు, లెక్కింపు ఏజెంట్లు ఆ రోజు ఉదయం 6.30 గంటలకు కృష్ణా యూనివర్సిటీకి చేరుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు పాస్‌తో పాటు ఫొటో ఐడీ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏజెంట్ల నియామకం కొరకు ఈ రెండు రోజుల్లో దరఖాస్తు చేయాలన్నారు. ప్రతి ఏజెంట్ మూడు ఫొటోలు, ఆధార్ జిరాక్స్ కాపీలు మూడు, ఫారం-8 దరఖాస్తులను నేరుగా రిటర్నింగ్ అధికారికి శుక్రవారం సాయంత్రంలోగా అందజేయాలన్నారు. కౌంటింగ్ కోసం 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలట్ లెక్కింపునకు మూడు టేబుల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మొదటగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉంటుందని తెలిపారు. అది పూర్తయిన 30 నిమిషాల తరువాత ఈవీఎం మిషన్ల కౌంటింగ్‌కి పార్లమెంట్, అసెంబ్లీ వారీగా 14 టేబుల్స్ ఒక రౌండ్ గా గుర్తించి 15 రౌండ్లలో ఈవీఎం మిషన్ల ద్వారా లెక్కింపు పూర్తి చేస్తామన్నారు. కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు ఏజెంట్‌లు, కౌంటింగ్ సిబ్బంది విధిగా కౌంటింగ్ హాల్‌లోనే ఉండాలన్నారు. కౌంటింగ్‌కి కంట్రోల్ యూనిట్‌తో పాటు ఫారం-17సీ, మాక్ పోల్ సర్టిఫికెట్, బ్లాక్ కవర్‌తో ఉన్న వీవీ పాట్ స్లిప్స్‌తో కలిపి సంబంధిత టేబుల్ కౌంటింగ్ సూపర్వైజర్‌కు అందజేయడం జరుగుతుందని వివరించారు. కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్‌కు వచ్చేటప్పుడు డూప్లికేట్ ఫారం-17సీ, వైట్ పేపర్ పెన్నులతో హాజరు కావాలన్నారు. ఫారం-17సీలో ఉన్న ఓట్లు కంట్రోల్ యూనిట్ ఓట్లతో సరి చేసుకున్న పిదప పోలింగ్ స్టేషన్ వారీగా కౌంటింగ్ మొదలవుతుందని పేర్కొన్నారు. ఎక్కడైనా ఫారం 17సి, కంట్రోల్ యూనిట్ మధ్య తేడవస్తే వీవీ పాట్‌లో ఉన్న స్లిప్స్ కౌంటింగ్ చేసిన వాటిని పరిగణలోనికి తీసుకుని సరిచేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి పోలీస్ నోడల్ అధికారి డీఎస్పీ రమేష్ బాబు, సీఐ నాగప్రసాద్, పెడన ఎస్ఐ సూర్యశ్రీనివాస్, వివిధ పార్టీల అభ్యర్థులు, ఏజంట్లు హాజరయ్యారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కొక్కిలిగడ్డలో శ్రీ గంగా భ్రమరాంబ అమ్మవారు

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామంలో గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివార్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా బుధవారం ప్రారంభమయ్యాయి. మల్లేశ్వరస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి 26వ తేదీ వరకు ఐదు రోజులపాటు విశేష పూజా కార్యక్రమాలతో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, ఆచార్యాదిబ్రహ్మ రుత్విగ్వరణం, అఖండ దీపారాధన, పంచగవ్యప్రాశనం, చండీ సప్తశతీ పారాయణం, దేవాలయ ప్రదక్షిణం నిర్వహించారు. స్వామివారిని పెండ్లికుమారునిగా, అమ్మవార్లను పెండ్లికుమార్తెగా అందంగా అలంకరించారు. సాయంత్రం 6 గంటలకు అంకురారోపణ, ప్రధాన మండప కలశస్థాపన, వాస్తుహోమం, వాస్తుపర్యగ్నీకరణం, ధ్వజారోహణ, వేదస్వస్తి, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థప్రసాద వినియోగం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



అన్నవరం-చిర్లపాలెంలో కోలాట కళాకారుల సందడి

అన్నవరం-చిర్లపాలెం(మోపిదేవి): మారెమ్మ తల్లి ఉత్సవాల్లో బుధవారం సాయంత్రం నిర్వహించిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. మండల పరిధిలోని వెంకటాపురం శివారు అన్నవరం-చిర్లపాలెం గ్రామంలో మారెమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరిరోజు బుధవారం సాయంత్రంతో ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఐదు సంవత్సరాలు ఒకసారి నిర్వహించే ఈ జాతర ఉత్సవాలు గ్రామంలో పెద్ద పండుగలా సాగింది. భక్తులు మారెమ్మ తల్లి, పోతురాజు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సామూహికంగా సమర్పించుకున్నారు. మేళతాళాలు, డప్పుకళాకారులు సందడి, కళాకారులు కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నారు.

ఎన్నికల కోడ్ ముగిసే వరకు నిషేధాజ్ఞలు

- సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 అమలు
- అల్లర్లు, అలజడలు సృష్టించే వారిపై ఉక్కుపాదం



మహమ్మద్ సుభాన్

కోనేరుసెంటర్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలంతా నిబంధనలను కోడ్ ముగిసే వరకు పాటించాలని బందరు డీఎస్పీ మహమ్మద్ సుభాన్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో ముగిసేందుకు సహరించిన ప్రతి ఒక్క ఓటర్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు నలుగురి కన్నా ఎక్కువ మంది గుంపుగా ఉండకూడద న్నారు. అనుమతులు లేకుండా బహిరంగ సభలు, సమావేశలు, ర్యాలీలు నిర్వహించకూడదన్నారు.

ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థి పార్టీ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాలో తప్పుడు వదంతులను పోస్ట్ చేయడం చట్టరీత్యా నేరం అన్నారు. అనుమతులు లేకుండా బాణసంచా కాల్చినా, ఇతర పార్టీ అభ్యర్థులు, కార్యకర్తల ఇంటి ముందు కవ్వించే విధంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా డీజేలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేసి, డీజేలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనుమానితులు తారసపడితే తక్షణమే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు -డీఎస్పీ మురళీధర్

అవనిగడ్డ: ప్రశాంతంగా ఎన్నికలు జరిగిన విధంగానే ఓట్ల లెక్కింపు రోజున అందరూ సంయమనంతో మెలిగి శాంతి భద్రతలకు సహకరించాలని డీఎస్పీ మురళీధర్ చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందన్నారు. అనుమతులు లేకుండా సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఉద్దేశ పూర్వకంగా ప్రత్యర్థి పార్టీ నాయకులను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటం, తప్పుడు సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం వంటి పనులు చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణ సంచా కాల్చడం, ఇతర పార్టీ అభ్యర్థుల ఇళ్ల ముందు కవ్వింపు చర్యలకు పాల్పడంటం, సివిల్ తగాదాలను అడ్డుపెట్టుకుని రెండు వర్గాల మధ్య రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువకులు బైక్‌ల సైలెన్సర్లు తీసి హంగామా చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ అందరూ సంయమనం పాటించాలని, ఫలితాల రోజున ఎలాంటి హడావిడి, రెచ్చగొట్టే పనులు చేయొద్దని డీఎస్పీ హితవు పలికారు. ఈ సమావేశంలో అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు త్రినాథ్, నాగప్రసాద్, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

నేడు వేణుగోపాలుడి కల్యాణం



కోడూరు: మండలంలోని పాదాలవారి పాలెం గ్రామంలో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి కల్యాణాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుధాకర్ బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. వేణుగోపాలుడి మూలమూర్తికి ప్రత్యేక అలంకారం, కల్యాణమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. కల్యాణం అనంతరం అన్నసమారాధన ఉంటుందని, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొవాలని కోరారు.

కర్రసాములో విద్యార్థుల ప్రతిభ

కలిదిండి: కర్రసాములో కలిదిండి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ సానా వెంకట రామారావు బుధవారం తెలిపారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో వరల్డ్ యూనియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని విజ్ఞాన విహార ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో అంతర్జాతీయ కర్రసాము పోటీలు జరిగాయని పేర్కొన్నారు. పోటీల్లో పాఠశాలకు చెందిన కె.నాగసాయి చంద్ర గణేష్, కట్ట హాశ్వంత్ బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అదేవిధంగా సయ్యద్ హనీఫ్, కొండేటి భగవాన్ వెండి, కొండేటి సాయికృష్ణ, చంద్రగణేష్ కంచు పథకాలు సాధించినట్లు పేర్కొన్నారు. కర్రసాములో శిక్షణ ఇచ్చిన మధుబాబు, విజేతలను ప్రిన్సిపాల్ కె.జయ పాండురంగారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

శోభాయమానంగా జగజ్యోతి ఉత్సవం



ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దంపతులు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీదేవి భూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాల్లో మంగళవారం రాత్రి జగజ్యోతి కార్యక్రమం శోభాయమానంగా జరిగింది. అంతకు ముందు నిత్యార్చన, నిత్యహోమం, బలిహరణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలో నాలుగో రోజు ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా నిత్యార్చన, నిత్యహోమం, బలిహరణ పూజలు, ఎదుర్కోలు కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా జరిపారు. అలయ ప్రధాన అర్చకుడు పంచాగం రమణాచార్యులు, కందూరి శ్రీనివాసాచార్యులు హోమ కార్యక్రమాలు నిర్వహించారు. వంశ పారంపర్య ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, భోగాది వెంకట శేషగిరిరావు, భోగాది లోకేశ్వరరావు, భోగాది అప్పారాయుడు సతీ సమేతంగా నాలుగు జంటలు పీటలపై కూర్చుని పూజాధికములు జరిపారు. గురువారం రథంగహోమం, రథోత్సవం, గ్రామ బలిహరణ జరుగుతాయని ధర్మకర్త చెప్పారు.

నేడు మాధవస్వామి కల్యాణం



అశ్వవాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

గూడూరు: స్థానిక దేవి భూదేవి సమేత శ్రీ మాధవ స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారిని అశ్వవాహనం ఎదుర్కోలు సన్నాహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి మంగళహారతులు పట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం స్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కలపటపు నవరంగ్ కిషన్ తెలిపారు.

ఈఏపీసెట్‌కు 368 మంది హాజరు



పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో బుదవారం జరిగిన ఈఏపీసెట్ ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ బీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 16న ప్రారంభమైన ఈఏపీసెట్ పరీక్షలలో భాగంగా బుధవారం ఏడో రోజుకు చేరాయన్నారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 193 మందికి గాను 184 మంది హాజరయ్యారని, తొమ్మిది మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన పరీక్షకు 193 మందికి 184 మంది హాజరయ్యారని, 9 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా పరీక్ష నిర్వహించామని తెలిపారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం



అడ్మిషన్ల కోసం క్యాంపెయిన్ చేస్తున్న హెచ్ఎం డి.పుష్పలత, ఉపాధ్యాయులు

గూడూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్న ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డి.పుష్పలత తెలిపారు. గూడూరులోని హైస్కూలును అప్‌గ్రేడ్ చేసి ప్లస్-2 ఏర్పాటు చేశారన్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక్కో గ్రూపునకు 40 సీట్ల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు చుట్టుపక్క ప్రాంతాల వారు ఇంటర్మీడియెట్ చదవటానికి అడ్మిషన్ పొందవచ్చని వెల్లడించారు. కొత్తగా ఏర్పాటు చేసిన కళాశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఇంటింటికీ క్యాంపెయిన్ నిర్వహించి అడ్మిషన్లు ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 14 మంది విద్యార్థులు కళాశాలలో ప్రవేశం పొందారని ఆమె చెప్పారు.

అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం



ర్యాలీలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు

ఘంటసాల: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటూ బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినుల ఆధ్వర్యంలో ఘంటసాల గ్రామంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఘంటసాలలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఆటల పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ముందుగా ఘంటసాల గ్రామ సచివాలయం ఉద్యోగులతో కలసి ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. పచ్చని చెట్లు ప్రగతి మెట్లు అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ అపర్ణ, డాక్టర్ విజయ్ కుమార్, విద్యార్థినులు, సచివాలయ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శాంతికల్యాణం



కల్యాణోత్సవంలో దంపతులు నాగచైతన్య, చంద్రరేఖలు

పెడన: పట్టణంలో శ్రీశ్యామలాంబ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి స్వామి వారి శాంతి కల్యాణం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దంపతులు కొసనం నాగచైతన్య, చంద్రరేఖ దంపతులచే పండితులు భవానీ శంకర్ శాంతి కల్యాణాన్ని జరిపించారు. ఆలయ ఈవో తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు, అర్చక స్వామి గూడూరు ఓంకారేశ్వరశర్మల పర్యవేక్షణలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కొనసాగిన అగ్ని సువార్త స్వస్థత సభలు

మచిలీపట్నం టౌన్: మెస్సీయ హోలీ ఫైర్ మినిస్ట్రీస్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు రింగ్ సమీపాన ఏర్పాటు చేసిన 7వ క్రీస్తు పరిశుద్ధ అగ్ని సువార్త స్వస్థత మహోత్సవాలు రెండో రోజైన బుధవారం కొనసాగాయి. కర్నూల్‌కు చెందిన పాస్టర్ ఫ్రెడ్డిపాల్ బైబిల్‌లోని పలు అధ్యాయాలను క్రైస్తవులకు వివరించారు. ప్రభువైన ఏసుక్రీస్తుపై విశ్వాసం ఉంచి చేసే ప్రార్థనతో ఎన్నో మేలులు చేకూరుతాయని ఆయన వివరించారు. రోగుల స్వస్థత కోసం ఫ్రెడ్డిపాల్, మెస్సీయ హోలీఫైర్ మినిస్ట్రీస్ నిర్వాహకుడు బ్రదర్ మధువిక్టర్‌పాల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంగీత బృందం ఆలపించిన క్రైస్తవ గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సభలకు మచిలీపట్నం నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి క్రైస్తవులు వేలాదిగా తరలివచ్చారు.

సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

కృత్తివెన్ను: మండలంలో పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నామని ఏవో జెన్నీ తెలిపారు. జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగ సబ్సిడీ పోను రైతుకు కేజీ రూ.44లకు పిల్లిపెసర రూ.67, జనుము రూ.44లకు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్సు తీసుకురావాలన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

ప్రధాన డ్రెయిన్‌లో పూడికతీత

మచిలీపట్నం టౌన్: నగరంలో మురుగునీటి పారుదలకు ఉపయోగపడుతున్న సబ్‌జైల్ డ్రెయిన్‌లో సిల్ట్, పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు పనులు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు బుధవారం చేపట్టారు. నగర కమిషనర్ సీహెచ్ వీవీఎస్ బాపిరాజు ఆదేశాలతో ఈ డ్రెయిన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే పనులు చేపట్టారు. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి, వాయుగుండం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పనులు చేపట్టారు. నగరంలోని వర్షపు నీరు ఈ డ్రెయిన్ ద్వారా ప్రవహించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు నిర్వహిస్తున్నారు.



సబ్‌జైల్ ప్రధాన డ్రెయిన్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు